# ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక
4.8.1994
5 రూపాయలు



- వర్షాకాలం
- సారీసర్...
- పిల్లలున్నారు జాగ్రత్త

డబుల్ బెనిఫిట్‌తో

# సింగిల్ పేజీ కథలు

ఈ పేజీల్లో కథ ప్రచురిస్తే చాలు. మీకు కథలు రాయడం వచ్చేసినట్టే! అంటే రచయితగా, రచయిత్రిగా మీ భవిష్యత్తుకు ఈ పేజీ సోపానమనుకోండి. రచయి(త)త్రులకు రెమ్యునరేషన్‌తోపాటు ఆంధ్రభూమి ప్రశంసా పత్రం ప్రత్యేకంగా లభిస్తుంది! ఈ పేజీ కథ మీ రైటింగ్‌లో ఒక పేజీ మాత్రమే వుండాలి.

## సింగినాదం

—టి.ఎన్.కృష్ణమోహన్
సన్నాఫ్ టి.ఎస్.ఆర్.వి.ఎస్.శర్మ
డోర్ నెం.4–2–11(1)
వుడ్‌పేట
అనకాపల్లి–531001.

సింగినాదానికి సిగరెట్ కాల్చడం ఆరో ప్రాణం. రోజంతా భోజనం లేకుండా అయినా వుండగలడు కానీ సిగరెట్ కాల్చకుండా మాత్రం వుండలేడు. అంతగా అతడి జీవితంతో పెనవేసుకుపోయింది ఆ సిగరెట్ బంధనం.

ఎవరైనా "నీ అభిమాన హీరో ఎవరోయ్ సింగినాదం" అనడిగితే "సిగిరెట్ ఈజ్ మై ఫేవరెట్ హీరో' అంటూ ఛాతీ విరుచుకుని మరీ చెప్తాడు గొప్పగా.

అలాంటి సింగినాదంని ఓ రోజు పేపర్లో ప్రపంచ ఆరోగ్య సంస్థవారి "ధూమపానాన్ని అరికట్టండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అనే స్లోగన్ ఆకర్షించింది. చదివిన కొద్దిసేపట్లోనే ఆ ఆకర్షణ కాస్తా ఆవేశంగా మారిపోయి మండిపోయి ఆ స్లోగన్‌కి నిరసనగా పెద్దపెట్టున ధూమపాన ప్రియులందర్నీ కూడగట్టుకుని వారంరోజులపాటు ఉద్యమం లేవనెత్తి బంద్‌లు... హర్తాళ్‌లతో ప్రపంచ ఆరోగ్య సంస్థ వాళ్ల స్లోగన్‌ని దడదడలాడించేసి చివరికి "ఖగపతి అమృతము తేగా... భుగభుగమని పొంగి పొరలి పొగ చుట్టయి జన్మించెన్ పొగతాగనివాడు దున్నపోతయ్ పుట్టున్" అని గురజాడవారి పద్యం విన్పించేసి ప్రభుత్వాన్ని, ప్రజల్ని హెచ్చరించి అంతటితో ఉద్యమాన్ని విరమించేసి సిగరెట్ మీద తన అభిమానాన్ని నిలుపుకున్నాడు.

ఓ వారంరోజుల తరువాత...

'ఆఫీసు నుంచి ఇంటికొస్తున్న సింగినాదానికి ఓ పాన్‌షాప్ దగ్గర సిగరెట్ కాలుస్తున్న తన కొడుకు పన్నెండేళ్ల బాబిగాడు కన్పించాడు. అంతే కోపంతో మండిపడుతూ ఇంటికొచ్చి శ్రీవారి కోపానికి కారణం ఏంటో తెలియక తికమకపడ్తున్న భార్యమీద ధుమధుమలాడాడు.

మరోక్షణం తరువాత... ఇంట్లో అడుగుపెట్టిన బాబిగాడ్ని గుమ్మంలోనే నిలేసి "ఏరా వెధవా! ఈ వయస్సునుంచే నీకు సిగరెట్ కాల్చే అలవాటేంట్రా! ఏం ఒళ్లు తిమ్మిరిగా వుందా!" హుంకరించాడు సింగినాదం కొడుకువైపు కోపంతో చూస్తూ...

బాబిగాడు ఆశ్చర్యపోతూ "అదేంటి నాన్నా! మొన్నోసారి నువ్వేగా చెప్పావ్! పొగ తాగనివాడు దున్నపోతయి పుట్టున్ అని. అప్పుడే మర్చిపోయావా! ఇంత అందమైన పర్సనాలిటీ వున్న నేను వచ్చే జన్మలో దున్నపోతుగా పుట్టడం ఇష్టంలేకే సిగరెట్ కాల్చడం నేర్చుకుంటున్నాను! ఏం! నీకు నేను వచ్చే జన్మలో దున్నపోతుగా పుట్టడం ఇష్టమేనా! చెప్పు' అన్నాడు అమాయకంగా.

అంతే!

ఎన్నోసార్లు బహిరంగంగానే కొడుకు చేత సిగరెట్లు తెప్పించుకుని చివరికి తన ఉద్యమం లేవదీసినప్పుడు కూడా ఆ విశేషాలు కొడుక్కి చెప్పి మురిసిపోయిన సింగినాదం పోలికాడి సమాధానానికి, తెలివికీ తేలుకుట్టిన దొంగలా, దిక్కుచచ్చి స్థాణువులా నిలబడిపోయాడు.

పాపం సింగినాదం!

* *

## ఎదురుగాలి

—కె.విజయలక్ష్మి
కేరాఫ్ కె.ఎల్.నారాయణ
ఎకౌంటెంట్
బాపట్ల–హెచ్.పి.ఓ
522101.

"జానకమ్మొదినా... జానకమ్మొదినా...' పెరటి గోడ దగ్గర రాళ్ల గుట్టెక్కి పిలుస్తోంది అనసూయమ్మ.

"అత్తయ్యా లేరు పిన్నిగారూ! తెలిసిన వాళ్లింటికెళ్లారు" బాదం చెట్టు కింద కూచుని పప్పు కడుగుతున్న జానకమ్మ కోడలు గోడ దగ్గరకు వచ్చి చెప్పింది.

అనసూయమ్మకు కావల్సిందదే! జానకమ్మ వీధిలోకెళ్లడం చూసే పిలిచింది.

మొహం నిండా సంతోషం నింపుకుని "అయ్యో నా తల్లీ! పిన్నిగారు అని ఆప్యాయంగా పిలిచే నిన్ను చూస్తే నా కడుపు తరుక్కుపోతుంది"

ఎందుకు అన్నట్లు క్వశ్చన్ మార్క్ మొహం పెట్టింది.

"పుట్టింట్లో ఐశ్వర్యం మధ్య అనురాగంగా పెరిగినదానివి. పనంటే ఏంటో తెలీని సుకుమారివి. ఆ జానకమ్మ వట్టి రాక్షసి! అంత కట్నం తెచ్చిన నీతో ఇంటి పని, వంట పని ఇంతెందుకు నీ చేత గొడ్డుచాకిరీ చేయిస్తోంది. గుమ్మడిపండులా వుండేదానివి ములక్కాడలా అయిపోయావు. దబ్బపండులాంటి నీ వొంటి ఛాయ పొగుసూరుకట్టెలా అయిపోయింది"

"..."

"ఏదో నా బిడ్డలాంటిదానివి. పచ్చగా పదికాలాలపాటు బతకాల్సిన దానివి. నువ్వు నీ మొగుడు సుఖసంతోషాల్తో వుంటే... పిల్లాపాపల్తో చల్లగా వుంటే చూసి సంతోషించేదాన్ని" కొంగుతో కళ్లొత్తుకుంది.

"నీ కోసం మాట వచ్చినా పర్లేదు. నువ్వు సుఖంగా వుంటే అదే చాలు" అటూ ఇటూ ఓసారి చూసి చిన్న గొంతుతో చెప్పింది "ఆ జానకమ్మ నిన్ను సరిగ్గా కాపురం చెయ్యనీయదు. అందుకే అన్ని సదుపాయాలతో వున్న ఓ ఇల్లు చూసాను. మంచి రోజు చూసి వేరు కాపురం పెట్టించేయి" అని చెప్పింది.

ఆమె ముఖంలో వచ్చిన మార్పును చూసి అనసూయమ్మ మనసు ఆనందంతో గంతులేసింది.

"నా సుఖ సంతోషాలకోసం మీరింత శ్రమ తీసుకుంటే నేనెలా కాదంటాను పిన్నిగారు.. గయ్యాళి అత్త పీడ తప్పక విరగడ చేస్తాను" అని చెప్పింది.

వారం తరువాత లారీలోకి సామాను ఎక్కిస్తున్నాడు అనసూయమ్మ కొడుకు కుమార్ తన భార్యతో వేరింటి కాపురం కోసం.

వరండాలో నిలబడి నవ్వుతూ చూస్తోంది జానకమ్మ కోడలు.

ఆ ఎదురుగాలికి విస్తుపోయి చూస్తోంది అనసూయమ్మ.

* *

"ఐలవ్ యు"

వారం రోజుల్నుండి అనాలనుకుంటున్న మాటకి నాలోని ప్రేమికుడు ధైర్యా

చేసి ప్రోత్సహించడంతో పైకనేశాను.

పదిగజాల దూరంలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యుల్లత! ఆమె మెరుపు మేనికి నేను పెట్టుకున్న పేరు? వెనక్కి తిరిగి చూసి రెండు క్షణాలు తటపటాయించి నావైపు రాసాగింది.

నా ఫాస్ట్ ఏక్షన్‌కి ఆమె ఇమ్మిడియెట్ రియాక్షన్ నన్ను సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యేలా చేసింది. మంచైనా చెడైనా రిజల్ట్ ఋగ్గవిూదే వుంటుంది.

మంచైతే ముద్దుగాను, చెడైతే చెప్పు ముద్రగాను.

ఆమె నా దగ్గరకు వచ్చి ''విూతో మాట్లాడాలి అలా పార్కుకు వెళదామా'' అంది.

నాలోని ప్రేమికుడు పిచ్చి ఆనందంతో గంతులేస్తున్నాడు.

ఇద్దరం పార్కుకెళ్లి గుబురుగావున్న చెట్టుదగ్గర కూర్చున్నాం.

ఆమె ప్రారంభించింది.

## శుభలేఖ

పి.వి.సుబ్బారాయుడు
ఇ.నెం.8–78, గౌతంనగర్,
ఫిరోజ్‌గూడ, బోయినపల్లిబు
సికింద్రాబాదు–500 011.

'వారం రోజులుగా నాతో మాట్లాడాలని మీరు చేస్తున్న ప్రయత్నం నేను గమనిస్తున్నాను. ఇవాళ ధైర్యం చేశారు బాగానే వుంది. ప్రేమంటే రెండు మనసుల మధ్య ఏర్పడే అవ్యక్తానుబంధం. దాన్ని పరిపూర్ణంగా ఎవరూ నిర్వచించలేదు. అందుకే రైటర్స్ తమ తమ కోణాల్లో దాన్ని నిర్వచించడానికి ప్రయత్నించారు. ప్రేమ మానసికమైన అజరామరమవుతుంది. శారీరకమైనప్పుడు తాత్కాలికం... కంటికి కనిపించే అంశాన్ని బట్టి అది మారుతుంది. వారం రోజుల్లోనే 'ఐ లవ్ యు' అన్నారంటే దానిక్కారణం నా శారీరక ఆకర్షణ... నేను అందమైన దాన్ననడానికి నేనందుకున్న వంద ప్రేమలేఖలే సాక్ష్యం. అందాన్ని అందరూ చూడగలరు కాని, మనసుని చూడడానికి శక్తి కావాలి... ఆ శక్తివున్నవారు చరిత్రలో మిగిలిపోతారు.

నెల్రోజుల క్రితం మీరు పెళ్లిచూపుల్లో చూసిన శారదని ఎందుకు కాదన్నారు?

ఆమె చామనఛాయగా వుంటుందని విూరు... వాళ్ల నాన్న బడిపంతులు కట్నమేమివ్వగలరని మీపెద్దవాళ్లు అంగీకరించలేదు.

అన్నీ అర్హతలుగల మగవాడిని నాకు మొగుడుగా చేసే కెపాసిటీ బిజినెస్ మాగ్నెట్ అయిన మా నాన్నకుంది. కాని శారదకలా కాదే... అసలే ఆడపిల్లల జీవితాలు కట్నాల కొలిమిలో సమిధలవుతుంటే – ఈ ప్రేమ వివాహాలు ఒకటి. అందంగా వుంటే సరే... లేకపోతే మానసిక క్షోభే...

మన వెనకటి తరాల్లో లవ్ మేరేజెస్ వుండేవా? అయినా జీవితాంతం ఒకరి కష్టసుఖాల్లో ఒకరు పాలుపంచుకుంటూ వైవాహిక జీవితం ఆనందమయం చేసుకోలేదా?

నా స్నేహితురాలని కాదుగాని శారద మంచి పిల్ల... అమాకయత్వం కాస్త ఎక్కువ పాళ్లు వున్న పిల్ల... ఆమెను చేసుకున్న వారెవరైనా జీవితాంతం సుఖపడ్తారు. ఆమె విషయంలో మీరు మరోసారి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నాను. మీ మంచితనం మీద నాకు పూర్తి నమ్మకం వుంది.''

ఆమె నిజంగా విద్యుల్లతే... నా మనసుకి షాక్ ట్రీట్‌మెంటిచ్చింది.

నేను లేచి నుంచున్నాను.

''వెళ్లిపోతున్నారా?'' గాబరాగా అడిగింది.

''ఆ... త్వరలో నాకూ శారదకి పెళ్లి నిశ్చయం చేసుకుని మొదటి శుభలేఖని మీకే ఇస్తాను... మీరు దగ్గరుండి జరిపించాలి మా పెళ్లి'' అని బస్టాపువైపు నడకసాగించాను.

* *

నిన్నటిరోజు సాయంత్రం ఇంటికి చేరేసరికి, శ్రీమతి రుసరుసలాడుతూ 'టీ' అందిస్తూ, కూడా ఒక ఉత్తరాన్ని చేతిలో పెట్టేంది.

వ్రాత చూస్తూనే చిట్టి వ్రాసినట్లు గుర్తుపట్టాను.

చిట్టి నా చెల్లెలు. పేరు సుచిత్ర అయినా ఇంటిలో అంతా చిట్టి అని పిలిచే వాళ్లం.

ఉత్తరం తెరచి ఉండటంతో, శ్రీమతి చదివే ఉంటుందిలే అని 'ఏమిటి విషయాలు' అని అడిగాను.

ఆ మాటకోసమే ఎదురుచూస్తున్నట్లు – ''రాబోయే సంక్రాంతికి తనురాలేక పోతున్నట్లు– వాళ్ల ఆయనకు ఆఫీస్‌లో పని వత్తిడి కారణంగా శెలవు దొరకదని, వీలైతే మిమ్మల్నే ఒకసారి హైదరాబాదు వచ్చి చూసి వెళ్లమని వ్రాసింది... చూడండి ఏదో పెళ్లంటూ చేసాం. ఇంకా పండగ పిలుపులూ పెట్టుపోతలూ జరిపిస్తూ కూర్చుంటే మన సంసారం గుల్లకావటం ఖాయం. విూరు హైదరాబాదు వెళ్లటం – 'పట్టి చేతులతో ఏం వెళతానని' చిట్టికి చీరె

## పట్టు చీర

డి.పద్మావతి
డాటరాఫ్ డి.రంగనాయకులు
కానుకుర్తివారి వీధి
శ్రీకాకుళం–532 001.

వాళ్లాయనకు కొత్తబట్టలు కొనుక్కొని వెళ్లటం లాంటివి చేస్తారేమో? అలాంటివేవీ కుదరవ్. ఈ పండగకైనా గ్రైండర్ కొంటానని మాటిచ్చారు. గుర్తుందికదూ'' అంటూ ఒక చిన్నసైజు లెక్చరిచ్చింది.

ఆలోచనలో పడ్డాను–

ఆ మర్నాడు–

శ్రీమతి ముఖం చాలా ప్రసన్నంగా ఉంది. నవ్వుతూ టీ అందించి ప్రక్కనే కూర్చుంటూ, ''ఊరినుంచి మా అన్నయ్య వచ్చాడండి. మీరెలాగూ మా పల్లెటూరు వెళ్లటం అంటే ఇష్టపడరు అని అన్నయ్యనే రమ్మని వ్రాసాను, చూసి చాలా రోజులైంది కదా అని''. చూడండి పోచంపల్లి పట్టుచీర తీసుకొచ్చాడు నాకోసం–ప్రక్క వీధిలో ఎవరో తెలిసిన వాళ్లుంటే చూసి వస్తానని వెళ్లాడు, ఇప్పుడే వచ్చేస్తాడు' అంటూ ఆనందంగా చెప్పుకుపోతోంది.

తన భర్త ఆడపడుచుకు ఏమీ కొని ఇవ్వకూడదు కానీ, తనకు మాత్రం తన అన్నయ్య చీరలు కొనివ్వాలా?

ఏదేమైనా, ఇదే సమయం –ఆమెను ఒప్పించి 'చిట్టి'కొక పట్టుచీర కొనిపెట్టాలని అనుకొంటున్నాను!

* *

''త్వరగా లేచేడవండి, ఎటు వెళ్దామన్నా మిమ్మల్ని దాటుకుంటూ వెళ్లలేక నానా అవస్థలు పడుతున్నాం'' మరోమారు నన్ను దాటబోయి అమాంతంగా నా కాలు తొక్కి గంయ్‌మంది నా భార్య వరలక్ష్మి. ''ఆహా ఇవాళ ఆదివారం అనుకుంటున్నారేమో? విూ పన్లు మిూకున్నాయి. ముందు పరంధామయ్య దగ్గరకెళ్లి పదో పరకో అప్పుతేవాలి'' ... ఇంకేదో అనుకుంటూ పక్కబట్టలు మడుతబెట్టుకెళ్లింది.

'అప్పు' మాట వినగానేనా గుండె ధడేల్ మంది.

''మళ్లీ అప్పెందుకే వారం క్రితమేగా రెండు వందలు పరంధామయ్యగారి దగ్గర తీసుకొన్నాం?'' నీరసంగా అడిగాన్నేను.

''అవన్నీ విూ మామగారి మందులకే అయ్యాయి. ఇప్పుడూ అందుకే... పాపం! నాన్నగారు రెండ్రోజుల నుండి తెగబాధపడుతున్నారు... ''మందుల్లేక'' భావోద్రేకంగా గుడ్లనీరొత్తుకుంటూ చెప్పింది.

మొహం కడుక్కొని, పరంధామయ్య ఇంటికెళ్లాను. అక్కడ నాకు చుక్కెదురే అయ్యింది. ఇంకా నలుగురు తెల్సిన స్నేహితులింటికి వెళ్లాను ఊహూ! లాభం లేకపోయింది. చేసేదేంలేక ఇంటికొచ్చాను. లోపలికెళ్లి పడుకొని, ''అప్పు'' తేవటమెలా? గురించి ఆలోచించసాగాను. రకరకాల ఆలోచన్లు వచ్చి వెళ్లిపోతున్నాయ్.

చివరికి ఒక ఆలోచన తట్టాక హాయిగా నిద్రపోయాను.

మర్నాడు ఉదయమే లేచి, అందరి

## అప్పు

డి.వేణుమాధవ్
గున్నూరు
వరంగల్–506 317.

'కాళ్లూ దాటుకుంటూ' చివరి గదిలో ఉన్న ముసలోడి ఖాళీ మందుల సీసాలు ఒక బస్తాలోకివేసి, అమ్మేసి మందులు తీసుకొని వచ్చేసరికి శ్రీమతి బయట నిలబడి ఉంది.

''ఇవిగో మీ నాన్నగారికి మందులు'' అన్నాను.

ఆమె సంతోషంగా మందులు తీసుకొని, వెనక రూమ్‌లోని షెల్ఫ్‌లో పెట్టబోయి –''అయ్యో! ఇక్కడి ఖాళీ సీసాలేవండీ? వీటిని చూసే పక్కింటి పంకజం పది రూపాయలిచ్చింది'' అన్న మాటలకు నేను పూర్తిగా స్పృహ కోల్పోకముందే పక్కరూమ్‌లోని ముసలోడి ''దగ్గు'' నన్ను పలుకరించింది.

*